# నాదైన అనుభూతి నాదిగాన

సెలవుల్లో ఎన్నో పనులు చెయ్యాలనుకుంటాం. అనుకుంటే సరిపోయిందా? సెలవులనగానే మనిషిని ఒక స్తబ్దత ఆవరించేస్తుంది. ఆలస్యంగా నిద్రలేస్తాం. కాలకృత్యాలు ముగించి స్నానపానాల దాకా వచ్చేటప్పటికి గంట పదవుతుంది. దిన, వారపత్రికలు, ఇంకా ఏవైనా పుస్తకాలు చూస్తూ కూచుంటాం. మధ్యాహ్న భోజనానికి పిలుపొస్తుంది. భోజనానంతరం భుక్తాయాసం. అది కాస్తా నిద్రగా మారిపోతుంది. సాయంకాలాల్లో ఏవో బజారు పనులుంటాయి. ఇక చెయ్యాలనుకున్న పనులు చేసి ముగించే దెప్పుడు?

ఇలా కాదని మొన్నటి సాయంకాలం వాలుకుర్చీ పట్టుకెళ్ళి పెరట్లో వేసుకున్నాను. పెద్దదిగా గాక పోయినా, మా ఇంటికీ, మా స్థాయికీ తగినట్లు మాకూ ఒక చిన్నపూలతోట ఉండిపోయింది. పూలమొక్కల వైపు చూస్తూ కుర్చీలో కూర్చున్నాను. కలమూ, కాగితాలే ప్రక్కనే ఉన్నాయి. చేయాలనుకున్న రచనలు మనసులో సందడిచేస్తున్నాయి. ముందుగా దేన్ని ఎన్నుకోవాలన్నదే ప్రశ్న.

"ఏమండీ! కథ ఏదైనా రాయబోతున్నారా?" - వంటగది గుమ్మం నుంచీ ఈవలికి చూస్తూ అడిగింది మా ఆవిడ.

"ఏం రాయగూడదా?" అంటూ, తిరిగి చూశాను.

ఈ ప్రశ్నకు మాత్రం సూటిగా జవాబు చెప్పవలసిందేనన్నట్టుగా, మా ఆవిడ చరచరా వచ్చి చేదబావి చప్టాపైన కూర్చుంది. "ఏం రాస్తారండీ బాబూ! ఈ మధ్య ఏ కథ చూసినా ఇంతకు ముందెప్పుడో చదివినట్టే ఉంది. వందల కొద్దీ రచయితలు అదేపనిగా రాసిపారేస్తుంటే, ఇంకా రాయడానికి కొత్త కథలేం మిగిలి ఉంటాయి చెప్పండి? పాడిందే పాడడమేనా, మరేమన్నానా?"

మా ఆవిడలోని పాఠకురాలు నన్నిలా ప్రశ్నిస్తోందని గ్రహించాను. ఆమె వాదంలో పాయింటు లేకపోలేదు. ఇది కాస్త తీవ్రంగా ఆలోచించవలసిన విషయమే.

"కొంచెం కాఫీచేసి తీసుకొస్తావా నాగమణీ! ఆ లోపల కొత్త ఐడియా ఏదైనా తడుతుందేమో చూద్దాం?" అన్నాను.

ఆలోచిస్తూ ఆకాశం వైపు చూస్తున్నాను. ఈశాన్యమూలగా మల్లేశ్వరుడి గుట్టలపైన మబ్బు లలముకుంటున్నాయి. ఆ మూలగా మబ్బు లెక్కితే తప్పకుండా కొద్దిపాటి చినుకులైనా రాలడం పరిపాటి. వాన రాకను తెలియజేస్తూ చల్లటి గాలి వీస్తోంది. దగ్గర్లో ఎక్కడైనా కురుస్తూ ఉందేమో, వాన నీటితో తడిసిన మట్టి వాసన నాసాపుటాలకు తాకుతోంది. మసక మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి.

మా ఆవిడ కాఫీ గ్లాసుతో తిరిగొచ్చింది.

"ఏం, నాగమణీ! మబ్బులు, వాన, గాలి, చీకటి - ఇవన్నీ కలిసి నీకేమీ జ్ఞప్తికి తేవడం లేదా?" ప్రశ్నించాను.

కొద్ది క్షణాలపాటు నా ముఖంలోకి చూస్తూ ఉండిపోయిన నాగమణి, చటుక్కున జ్ఞాపకం వచ్చినట్లై "ఓహో ఆ కొండ, కొండపైన గుడి, చీకటివేళ.... అయ్యబాబోయ్, మరపుకొచ్చే విషయమేనా అది?" అంటూ మ్రాన్పడిపోయింది. మళ్ళీ అంతలోనే అసలు విషయం స్ఫురణకు రాగా, విస్తుపోతూ అడిగింది.

"ఏమండీ! అందును గురించి కథ రాయాలనుకుంటున్నారా, ఏమిటి?"

ఇది ప్రేరణ. దానివెంట పాత జ్ఞాపకాలు మేలుకున్నాయి.

◇ ◇ ◇

"ఇక్కడి నుంచి బస్సు అడవి దారి పడుతుంది. గుడి దగ్గర తినుబండారాలేవీ దొరకవు ఎవరికైనా కావలిస్తే ఇక్కడే కొనుక్కోవాలి" అన్నాడు డ్రైవరు.

అది ఆర్టీసీ బస్సు. పాతికమైళ్ళ దూరంలో ఉన్న చిన్న బస్తీ నుంచి అడవుల ఒడిలో ఉన్న దేవాలయం దగ్గరికి అది రోజూ మూడుసార్లు రాకపోకలు సల్పుతుంది. మధ్యాహ్నం ట్రిప్పులో మేము యాత్రార్థులమై వెళ్తున్నాము.

బస్తీలో కొనుక్కున్న పళ్ళు, బిస్కెట్లు సంచిలో ఉన్నాయి. అయినా ఎందుకైనా మంచిదని డ్రైవరు హెచ్చరించిన చోట బస్సు దిగాను. ఆ ఊరిపేరు లచ్చంపేట. ఏం పేటో గానీ అసలు సిసలైన ఒక మిద్దె కొంపైనా కానరావడం లేదు. ఎక్కువగా గుడిసెలు, పాకలు, ఈవలా, ఆవలా, తడికెలు. గట్టి రాతి మంటపాల్లో ఏర్పాటు చేసుకున్న నివాసాలు, అన్నట్టీ ఊర్లోకూడా ఒక గుడి ఉందట. ఇది చాలా పెద్ద గుడి. ఇక్కడ లచ్చంపేటలో ఉన్నదీ, అక్కడ కొండల్లో ఉన్నదీ కూడా ఒకే యాజమాన్యం కింద ఉన్నాయట. మేము దర్శించదలచుకున్న యాత్రాస్థలాల జాబితాలో ఈ లచ్చంపేట కూడా ఉంది. సాయంకాలం ఇక్కడ దిగాలి.

బస్‌స్టాపులో కొన్ని టీ స్టాల్స్ మధ్య పురాతన కాలపు పూటకూళ్ళ ఇంటి లాంటి హోటలొకటి కనిపించింది. లోపల విస్తర్లు కుట్టుకుంటున్నావిడ పెరుగు కలిపిన అన్నాన్ని విస్తరిలో ఒక పొట్లంగా కట్టి ఇచ్చి, ఖరీదుగా కొంచెం ఎక్కువ సొమ్మే తీసుకుంది. సొమ్ము మాటకేం గానీ, వెళ్లేది నట్టడివిలోకి. తీరా అక్కడికి వెళ్ళాక, అన్నం కావాలంటే దొరుకుతుందా? పండ్లు, తినుబండారాలు ఉన్నాయి గదా అంటారేమో? ఉండొచ్చు గానీ, ఉన్నవాటితో సరిపెట్టుకోడం మానవ స్వభావానికి విరుద్ధం కాదా? ఏదైతే అందుబాటులో ఉండదో, దానిపైకే వెళ్తుంది మనసు. అందుకనైనా అందుబాటులో ఉండాల్సిందే అన్నం పార్సల్!

ఊరు దాటుకోగానే బస్సు ఘాటు రోడ్డు వెంట కొండలపైకి ఎక్కసాగింది. మనిషికి చేరువగా ఉన్నంత వరకూ గడ్డి దుబ్బులుగా, ముళ్ళ పొదలుగా, చెట్ల తాలూకు అవశేషాలైన మోళ్ళుగా మధ్య మధ్య వట్టి రాళ్ళ బీళ్ళుగా కానవచ్చింది అడవి. ముందుకు వెళ్ళనూ, వెళ్ళనూ వృక్షాలు వాటి నీడలూ కూడా దట్టంగా బలిసి పోవడంతో కొండలపైన పెద్ద పెట్టున చలువ పందిరి పెట్టినట్టయిపోయింది. వంకరలు తిరుగుతూ వెళ్తున్న రోడ్డు ఆ చలువ పందిరి కింద ఒక వెలుగు సొరంగంలా ఉంది. ఆ రోడ్డు ఎక్కడికక్కడే ఆగిపోయినట్టు తోస్తుంది. ఆఖరైపోయినట్టుండే చోటికి చేరుకునేసరికి, మలుపు దిరిగి మళ్ళీ మరికొంత దూరం విస్తరిస్తుంది. పైకి చూస్తే ఆకాశం, కింద కాలు మోపితే పర్వత ప్రదేశం. చుట్టూరా పరికిస్తే అయోమయంగా కనిపించే కాననం. నాగరికతకు దూరంగా ఉన్న ఒక ఏకాంత సీమ మాకు స్వాగతం పలుకుతూ ఉంది. అందులోకి మేము చొచ్చుకుపోతున్నాము.

తారురోడ్డుపైన ఆర్టీసీ బస్సు డబడబలాడుతూ, ఒక పక్కకు వాలిపోబోతూ, బ్రేకులు డ్రైవరు అదుపులో ఉన్నాయా లేదా అన్న సందేహానికి ఆస్కారం కల్పిస్తూ, తాను నేర్చిన లీలలన్నింటినీ ప్రదర్శిస్తూ ఉంది. ఎటొచ్చీ దాని లీలల్ని తిలకించే ప్రేక్షకులు మాత్రం

తక్కువైపోయారు. డ్రైవర్నీ, కండక్టర్నీ మినహాయిస్తే బస్సులోని ప్రయాణీకుల సంఖ్య పదికి మించదు. అందులో ఒకటి శ్రీ వైష్ణవుల కుటుంబం. తల్లితండ్రులు అరవంలోను, బిడ్డలు తెలుగులోను మాట్లాడుకోవడం బట్టి చూస్తే అది తమిళనాడు నుంచి వెళ్ళి, ఆంధ్ర ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబంలా ఉంది. గోచీ పోసి కట్టుకున్న పట్టుచీరతో, జడచుట్ట పైన అర్ధచంద్రాకారపు పూలసరంతో, జ్యోతిలాంటి తిలకంతో ఆమె బచ్చెన బొమ్మలా ఉంది. ఎగదువ్విన క్రాఫింగుతో, కళ్ళద్దాలతో, తీర్చిదిద్దుకున్న తిరునామాలతో కొలతలు కచ్చితంగా సరిపోయే ప్యాంటు, షర్టు తొడుక్కుని అతడు కూడా మట్టసంగానే ఉన్నాడు. పక్కపక్కన పొదికగా కూర్చుని 'వేదా, వేదా' అంటూ అతను, 'ఇన్నాంగో, ఇన్నాంగో' అంటూ ఆమె స్వారస్యం ఉట్టిపడేట్టు మాట్లాడుకుంటున్నారు. 'వేదా' అనేది వేదవల్లికి గానీ, వేదవతికి గానీ సంగ్రహరూపమై ఉండాలి. "ఇన్నాంగో అంటే 'ఏమండీ' అనే సంబోధన. తల్లిదండ్రులకు ఆటవిడుపును ప్రసాదించి పిల్లలు ముగ్గురూ మూడు వేర్వేరు సీట్లు ఆక్రమించి, కిటికీలలో నుంచే పరిసరాలను సర్వే చేస్తున్నారు. పదేళ్ళ ఆడపిల్ల పద్దు (పద్మ) తమ్ముళ్ళపైన రన్నింగ్ కామెంట్రీ కురిపిస్తోంది. "ఒరేయ్, శీనూ! ఆ చెట్టు చూశావా, ఎంత ఎత్తుందో? అందులో ఒక కోతికూడా ఉందొరేయ్! అబ్బ, ఎంచక్కా దాని పొట్టకింద ఒక పిల్లకోతి! ఎంత బాగుందో చూద్రాగోపులూ?" "అవునవును చాలా బాగుంది గదా పద్దక్కా!" అంటూ తమ్ముళ్ళు అక్కగారితో శ్రుతి కలుపుతున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీవైష్ణవులది సంచలన కుటుంబం అనొచ్చు. అందుకు విరుద్ధంగా ఒక స్తబ్ద కుటుంబం కూడా బస్సులో ఉండిపోయింది. మాట్లాడవలసిన అవసరాలన్నింటినీ అధిగమించి, ఆ దంపతులు చూపుల ద్వారా, పెదవుల కదలిక ద్వారా, ముఖభంగిమల ద్వారా ఒకరి ఇంగితాన్ని ఒకరు గ్రహించగలిగే స్థితికి చేరుకున్నట్టున్నారు. ఆర్జించవలసినవన్నీ ఆర్జించి, అనుభవించవలసిన సుఖాలన్నీ అనుభవించి, నిర్వహించవలసిన బాధ్యతలన్నీ నిర్వహించి వానప్రస్థాశ్రమ స్వీకరించిన సంతృప్తి వారిలో కనిపిస్తూ ఉంది. వేషాన్నీ, వాలకాన్నీ బట్టి చూస్తే ఎంత కాలమైనా ఇలా తీర్థయాత్రలు నెరపుతూ పోగల ఆర్థికస్తోమత వాళ్ళకున్నట్టే ఉంది. ఒకటే ప్రతిబంధకం. సతీమణి జగదాంబగారు స్థూలకాయురాలు కావడం. పరిష్కరించడానికి వీల్లేనప్పుడు, ఉన్న ఇబ్బందితో సర్దుకుని జీవించడం బుద్ధిమంతుల లక్షణం. తమకోసం ముగ్గురు కూర్చునే సీటును ఎన్నుకోవడంలో నాకు శోభనాద్రి గారి ఎజ్ఞత తెలిసొచ్చింది. (మన్నించాలి, అప్పటికా భార్యాభర్తల పేర్లేమిటో నాకు తెలియదు. తరువాత్తరువాత వాళ్ళు దేవుడికి తమ పేరిట అర్చన చేయించిన సందర్భంలో గ్రహించాను.)

ఇందరిని గురించి చెప్పిన తర్వాత ప్రయాణీకుల్లో ఒకణ్ణిగా నన్ను గురించి నేను పరిచయం చేసుకోవడం నా కనీసపు ధర్మం. మా ఆవిడ గనుక నాతోబాటు లేకుంటే, నేనంత పనికీ పూనుకునేవాణ్ణి. ఉందిగనుక నాకు నిశ్చింత. తనకు దొరికిన మొదటి అవకాశాన్ని పురస్కరించుకుని, ఆమె తనను గురించి, నన్ను గురించి, ఇంకా మాకు సంబంధించిన సర్వవిషయాలను గురించి నివేదించగలదు.

మరైతే ఇప్పుడామె ఏం చేస్తోంది - అని అడగండి. తెలిసిందే కదా - వసపిట్ట చేసే పని!

"ఏమండేమండీ! ఆ లావుపాటావిణ్ణి చూస్తిరా? బస్సింకా లచ్చుంపేట రాకముందే, పుణ్యాత్మురాలికి నిద్రపట్టేసింది. ఇప్పుడింక ఊగే బస్సే తూగుటుయ్యాలై పోయింది.

అందరికీ అంత ఆనందంగా నిద్రపడుతుందా? దేనికైనా అడిగి రావాలి. బాగుందిగానండీ, అదో ఓలింగరం వచ్చినట్టుగా తూలితూలి ఆయన మీద ఒరిగిపోతూ ఉందే, అప్పుడేనండీ నాకు అయ్యో అనిపించేది పాపం ఆ కట్టుకున్నాయన కమ్ములకంటుక పోయినాడు...."

"వాళ్ళ అవస్థేదో వాళ్ళు పడతారు నీకెందుకొచ్చింది నువ్వాకొండకొమ్మను చూడరాదా? అదిగో, అక్కడక్కడా ఎత్తుగాలేచి, మధ్యమధ్యలో వాలుగా దిగజారి, నిశ్చలంగా పడుకున్నట్టున్న ఆ కొండవైపు చూస్తుంటే నీకేమీ అనిపించడం లేదా నాగమణీ! ఒక నల్లటి పల్లెపడుచు అలిసిపోయిన తర్వాత ఆదమరచి నిద్రపోతున్నట్టుండడం లేదా? అది".

"వద్దు బాబూ, వద్దు. నాకటువంటి మాటలేవీ చెప్పొద్దు. ముందుగానే నేను భయపడి చచ్చిపోతున్నాను. నేరకపోయి ఈ యాత్రకు పూనుకున్నామేమోనని నా కనుమానంగా ఉంది. కాకపోతే ఈ అడవుల్లో ఏం దేవళమండీ? గుడైతే ఉంటుందటగానీ అక్కడ ఊరుగానీ, పల్లెగానీ ఉండదట! రాత్రయితే నరమానవులుండరట! వెళ్ళివెళ్ళి అలాంటి దేవళంలో ఠికాణా పెట్టమని ఆ దేముడనే ఆయనకు ఎవరు చెప్పినారో? ఆ గుడేమో దాని వైనమేమో చూచేసి, తొందరగా తిరుగుదారి పడితేగానీ నాకు మనసు మనసులో ఉండదు".

ఒకటి రెండు క్షణాలాగి ఈ సారి మెల్లగా నా చెవిలో ఊదేసింది నాగమని "ఈ అడవిలోకొట్టి కట్టేసి, మనదగ్గరున్నవన్నీ ఎవరైన లాక్కుపోతే అడిగే నాథుడున్నాడా?"

"అబ్బే, అలాంటివేవైనా జరిగేటట్టయితే, ఆ వార్తలు పత్రికల్లో రావా నాగమణీ? ఎందరో యాత్రికులు జంకుగొంకుల్లేకుండా వెళ్ళివస్తున్న చోటేగదా? పదిమందితోబాటే మనం. నేనున్నాను గదా, నీకెందుకు దిగులు?"

"ఉన్నారున్నారులెండి? మీరు పేద్ద ఫైల్మాను..."

బస్సిప్పుడు ఓ కొండవాగును అనుసరిస్తూ పరుగిడుతోంది. రాలి, వాడివత్తలై, ఒరుగులై పోయిన ఆకుల పోగుల కింద ఇసుకకూడా కనిపించకుండా పోయిన ఆ కొండవాగు ఎన్నెన్ని వంకరలైతే తిరుగుతూ ఉందో, బస్సు కూడా అన్ని వంకరలు తిరుగుతూ ఉంది. మిట్టలెక్కవలసి వచ్చినప్పుడు గసపోసుకుంటూ, రోడ్డు ఏటవాలుగా కిందికి దిగినప్పుడు ఊపిరి బిగబట్టుకుంటే, బస్సలా ముందుకువెళ్ళి, వెళ్ళి ఇక ముందుకు వెళ్ళేదారిలేక ఒకచోట ఆగిపోయింది. బస్సు ఆగిపోయినచోట రోడ్డు, దాని కొక్కింతదూరంలో కొండవాగు విస్తరించిన పదిపదిహేను గజాల దూరం మినహాయిస్తే, మిగిలిన వైపుల్లో కొండలతోనే పెద్ద ప్రాకారం కట్టినట్టుంది. రెండంతస్తులుగా అమరి ఉండడం వల్ల కింది అంతస్తు పాదపీఠంగానూ, పై అంతస్తు సుఖాసనంగానూ తోస్తూ, ఆ కొండల లోతట్టు ప్రదేశం ఒక పెద్ద సింహాసనంలా కానవస్తూ ఉంది. తలపైకెత్తి సూటిగా చూసినప్పుడు కొండల ప్రాకారంలో నుంచీ కనిపిస్తున్న చిన్న ఆకాశం ఆ సింహాసనానికి పట్టిన వెల్లగొడుగులా ఉంది. ఆ గంభీర, నిశ్చల, ప్రశాంత ప్రకృతి సీమలో మానవుల అస్తిత్వానికేమంత పెద్ద పరిగణ లేనట్టు నేను గ్రహించాను. ఆ అగాధంలో మేము దోమల్లా ఉన్నాము. చీమల్లా ఉన్నాము.

"ఏమండీ? భూప్రపంచకమంతా ఇక్కడికి ఆఖరైపోయినట్టుందే? ఇంకెక్కడికండీ వెళ్ళేది మనం? ఏదీ, గుడి కనిపించడం లేదే?" వాపోయే స్థితికి వచ్చేసింది మా ఆవిడ.

మేము నిల్చున్నచోటికి అల్లంత దూరంలో కొద్దిగా నీరున్న చిన్న కోనేరు. దాన్ని తాకుతున్నట్టుగా దక్షిణవైపున రెండు తాటిచెట్ల ప్రమాణంతో పైకిలేచి, పై అంతస్తు ఆకారం కల్పిస్తున్న కొండపేటు. కోనేటికీ, ఉత్తరపు కొండకు మధ్య చెట్లకింద ఒక రచ్చపట్టు. ఎట్ట ఎదుట పశ్చిమ దిక్కున మంటినీ మింటినీ కలిపేస్తూ మహోన్నతమైన కొండపేటు. మేము నిల్చున్న చోటునుంచీ కనిపించిన దృశ్యం ఇది.

వైష్ణవ గృహిణి వేదవల్లి తూర్పుగా తిరిగి పేటుపార్శ్వంలో ధారలు ధారలుగా దిగజారి కొండవాగులో పడుతున్న నీటిపాయలవైపు చూస్తోంది. సంచీ భుజానికి తగిలించుకుని, ప్లాస్టిక్కు బుట్ట చేబట్టుకుని – "ఇన్నాంగో" యాత్ర కొనసాగించడానికి సిద్ధమైపోయారు. శోభనాద్రి దంపతులు ఈ చివరి విషమ పరీక్షనెలా తట్టుకోగలం బాబూ అన్న సంశయంతో కొట్టుమిట్టాడి పోతున్నారు. భయం తాలూకు నీలినీడలు మా ఆవిడ ముఖంలో మరింత దట్టంగా ముసురుకుంటున్నాయి. ఉన్నట్టుండి ఆస్తబ్ధతనంతా చెదరగొడుతూ పిల్లల అరుపులు, నవ్వులు, కేరింతలూ వినిపించాయి. ఉలికిపడిపోతూ భర్తవైపు తిరిగింది వేదవల్లి – "ఇన్నాంగో! పద్దు ఎంగె? అడేయ్ సీనూ, గోపులా?"

అప్పటికి పిల్లలు పైకి వెళ్తున్న మెట్లదారి ఎక్కడుందో మేము పోల్చుకోగలిగాము. కోనేటి వైపున మలుపు తిరిగి, ఆకాశాన్ని చుంబిస్తున్న పడమటి కొండపేటకు, దక్షిణపువైపు రెండో అంతస్తు మిట్టకు మధ్యనుంచీ మెట్లదారి పైకి వెళ్తోంది. 'ఇంతదూరం వచ్చేశాం కదా? ఇక గుడిని దర్శించకుండా వెళ్ళడమనే ప్రసక్తి లేదు. వీలయినంత త్వరగా ఆ పని ముగించడం మంచిది' అన్న నిర్ణయానికి వచ్చినట్టుగా మా ఆవిడ నాకంటే ముందుగానే చకచకా మెట్లెక్కసాగింది. విడిచిపెట్టిన వడిసెలరాళ్ళలా ముందుకు దూసుకుపోయిన పిల్లలెక్కడున్నారోగానీ, వాళ్ళ కిలకిల నవ్వులు, కీచుమాటలూ దూరం నుంచీ వినవస్తున్నాయి. చెట్టపట్టాలు వేసుకునేటంత దగ్గరగా భార్యతో సాన్నిహిత్యం నెరపుతూ, ఆమె తోటిదే లోకంగా 'ఇన్నాంగో' ముందుకు సాగిపోతున్నాడు. నేను వెనుదిరిగి చూద్దునుగదా, దాదాపు యాభై మెట్ల వరకూ ఎక్కి రాగలిగిన జగదాంబగారు అక్కడొకచోట నీడపట్టులో కూలబడిపోయింది. ఆమె పైకి లేచేదాకా, తాను చేయగలిగిందేమీ లేదు, కనుక, లగేజీ మెట్లపైన పెట్టి శోభనాద్రి గారు అడవుల్లోకి చూస్తున్నాడు.

"ఏమండీ? ఇట్లా ఎంతదూరం వెళ్ళాలో మీకేమైనా తెలుసునా?" అంది మార్గమధ్యంలో నాగమణి.

"ఎలా తెలుస్తుంది నాగమణీ? నాకైనా ఇదే మొదటిసారి కదా? ఉండు, ఎవరైనా కనిపిస్తే అడుగుదాం..."

"ఈ అడవిలో మనుషులు కనిపించినట్టే ఉందిలేండి?"

అయితే మా ఆవిడ అభిప్రాయం ఒకటి రెండు నిమిషాల్లోనే వీగిపోయింది. పందెం వేసుకున్నట్టు గబగబా మెట్లు దిగుతూ, క్రిందికి వచ్చేస్తున్న పడుచుజంట ఒకటి మాకు ఎదురైంది.

"ఏమండీ సార్! మీరొచ్చిన బస్సు వెళ్ళిపోయిందా?" ఆతురత ధ్వనిస్తున్న గొంతుకతో అడిగాడు యువకుడు.

ప్రశ్న ఉద్దేశించింది నాకే అయినా, మా ఆవిడ బదులు చెప్పింది. "అయ్యో, ఇంకా ఎక్కడి బస్సు నాయనా? ఏమండీ మనం కోనేటి దగ్గరొస్తున్నప్పుడు బస్సు స్టార్టు కావడం మీకు కనిపించలా? అయ్యో, పాపం! కొంచెం ముందుగా వచ్చి ఉండగూడదా

నాయనా?" తనపైన తనకే నెలకొన్న సానుభూతిలో కొంత భాగాన్ని ఆ పడుచు జంటపైన కుమ్మరించింది నాగమణి.

"చూశావా అరుణా? వెళ్ళిపోదామంటే నువ్వు విన్నావా? చల్లగా ఉందండీ, కాసేపుందాం - అన్నావు. ఇప్పుడేమయింది? ఇంకేం చేస్తావో చెయ్యి" నిష్ఠురంగా అన్నాడు యువకుడు.

"పోనీలెండీ? ఎట్లాగూ వీళ్ళూ వస్తారు కదా? అందాకా రచ్చపైన కూచుందాం" అంటూ గునిసింది అమ్మాయి.

"వస్తాములేమ్మా, అమ్మాయ్! అడిగి తెలుసుకున్నాంలే! మరు బస్సు నాలుగుకేనట. అన్నట్టమ్మాయ్, ఆ గుడి ఇంకా ఎంత దూరంలో ఉంది తల్లీ?" నాగమణి వాకబు చేసింది.

"దగ్గరికొచ్చేశారులెండి? ఇంక కొద్దిమెట్లే, పైకి వెళ్తే ఓ బయలు కనిపిస్తుంది. ముందుకు చూడండి, అరఫర్లాంగు దూరంలోనే గుడి....?" బదులు చెబుతూ ఆ అబ్బాయి భార్యతోబాటు కనుమరుగై పోయాడు.

మళ్ళీ పిల్లల కలకలం వినిపించింది. "వచ్చేశామొచ్చేశాం. అదిగో గుడి, అదిగో గుడి" శీను, గోపులు అరుస్తున్నారు.

"కనిపెట్టేశాం. గుడిని కనిపెట్టేశాం" అంటూ ఉంది పద్మ.

"అమ్మయ్యా? వచ్చేసినాం బాబూ?" నిట్టూర్చింది నాగమణి.

ఒక ప్రదేశాన్ని గురించి మనకు కలిగే ఊహకు, వాస్తవంగా ఆ ప్రదేశం ఉన్న తీరుకూ అంతగా సమన్వయం కుదరకపోవచ్చు. కానీ నా ఊహకు, వాస్తవానికి బొత్తిగా పొంతన లేకపోవడం అంటే ఏమిటో; ఆ దేవాలయ దృశ్యాన్ని చూశాక తెలిసింది. రెండు కొండలు కలిసిపోతున్నచోట, వాటి పాదతలంలో దుర్భేద్యమైన శిలా ప్రాకారంలో నుంచీ పైకి కనిపిస్తున్న గోపురాన్ని బట్టి చూస్తే, ఆ గుడి ఒక ఇనప్పెట్టెలో నిర్మితమై ఉండవచ్చునని తోచింది. మహావృక్షాలు, పొదలు, బోదదుబ్బలు, పచ్చిక జొంపాలు దట్టంగా అలముకున్న పచ్చటి కొండ చరియలో ఆ గుడి, గాలికడ్డంగా పెట్టుకున్న చేతుల నడుమ నిశ్చలంగా వెలుగుతున్న దీపకళికలా ఉంది. గుడి దగ్గరనుంచీ ముక్కోణాకారంగా విస్తరించిన బయలు ప్రదేశం కింద కోనేటి దగ్గర నుంచీ పైకి లేచిన కొండ పేటు శిరో భాగంలో కలిసిపోయి, ఇంచుమించు సమతలంగా రూపొందింది. ఆ పేటు అంచుకు కొద్ది బారల దూరంలో, గుడికెదురుగా ఉండేటట్టు, నాలుగు వైపులా సోపాన పంక్తులున్న ఒక సుదృఢమైన నాలుగు స్తంభాల మండపం ఉంది. విశేష దినాల్లో అది ఉత్సవ విగ్రహాలకు విడిది చోటై ఉండవచ్చు.

ఆ అపురూపమైన దృశ్యం ఎదుట మేమంతా మైమరపులో ఉండగానే, పిల్లలెప్పుడో గుడి చేరువకు వెళ్ళిపోయారు. పాదరక్షలు బయట వదలిపెట్టి గుడిలో ప్రవేశించాము.

ప్రాకారానికి లోపలి ఆవరణలో సగం మేరకు విస్తరించిన చలువ మండపం చుట్టూరా ఇనుప కమ్ములు బిగించడం వల్ల ఒక పెద్ద బోనులా తయారైంది. కావడానికి సర్వేశ్వరుడే అయినా కాపురముండేది కొండల్లో గదా, ఆ పాటి రక్షణ అవసరమనుకున్నారేమో? చలువ మండపానికీ, ప్రాకారానికీ మధ్యలో పరచిన నాపరాళ్లు ఎండకు కాగి ఉండడం వల్ల పాదాలను చుర్రుమనిపించాయి. 'అబ్బ అబ్బ' అని వగర్చుకుంటూ అటు చివరకు దౌడు తీసి, ప్రాకారానికావైపు నుంచి గుడిపైకి కొమ్మలు సాచిన ఓ చెట్టు క్రింద మేము నిలబడిపోయాము. ఆగ్నేయమూలగా ఉన్న పాకశాలలో నుంచి సన్నగా

పొగ పైకి లేస్తోంది. యాత్రికులైన మమ్మల్ని మినహాయిస్తే, ఆ గుడి ఆవరణమంతా నిర్జనంగా ఉందనే చెప్పొచ్చు కానీ, ఒకే మినహాయింపు. దక్షిణపు ప్రహరీ గోడకున్న వెనుకవైపు ద్వారానికీ, చలువ మండపానికీ నడుమ రాతి తిన్నెపైన ఒక వ్యక్తి కూర్చున్నాడు. అతడు ముతక పంచను నడుముకు చుట్టుకొని, రెండు చుంగులూ పైకి తీసి గోచీ పెట్టుకున్నాడు. తల ఎంత సైజుందో అంతటి తలగుడ్డ చుట్టుకున్నాడు. మాసిన గడ్డానికీ, జీబురు మీసాలకూ మధ్య అతడి ముఖంలో కాసంత నుదురు, పిల్లి కళ్ళు, ఎత్తుగా ముక్కు పెదవుల్లో కొంత భాగం మట్టుకే కనిపిస్తున్నాయి. చెవులకు వెండిపోగు లున్నాయి. దండ కడియముంది. మెడలో తాయత్తు తగిలించిన నల్ల దారం ఉంది. అతన్ని గురించి ఎవరికి తగిన ఊహ వారికి కలిగి ఉండవచ్చు. నాకు మాత్రం అతడు వీరులందరూ వేటకు వెళ్ళిపోయిన తర్వాత కోట దర్వాజా దగ్గర కాపలా ఉన్న వీరమల్లుడిలా కనిపించాడు.

"గుడిలో ఎవరూ లేరా అబ్బీ?" అంటూ చొరవగా మొదలెట్టింది నాగమణి. మా ఆవిడ దగ్గర ఓ టెక్నిక్కుంది. అదేమిటంటే తానెవరి సమక్షంలోనైనా భయపడడ మంటూ జరిగితే, ఆ భావం బయటికి కనిపించనీయకుండా, ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించడానికి ముందంజ వేస్తుంది.

"రండమ్మా రండ. పూజ్జేసే అయ్యోరేగదా? ఈ దినం వరదాసారి వచ్చినాడు లెండ. ఉండాదుండాడు. కొండ గెణుసుగడ్డలు నాలుగు తెచ్చిస్తి. ఆట్నీ కాల్చుకుంటూ, అదో వంటింట్లో ఉండాడు, వచ్చేస్తాడు, మీరు కూకోండ. సాములూ, మీరున్నూ లోపల్కి పోండ..."

"అయ్యో, ఇదేం భాష?" అన్నారు శోభనాద్రి గారు.

"కన్నడ దేశపు తెలుగింతే లెండి. పొండ పొండ, రండ రండ. ఇదే వరస" అన్నాడు ఇన్నాంగో.

"మరైతే నువ్విక్కడ ఏం జేస్తున్నా వబ్బీ, దేవుణ్ణి చూచేటందు కొచ్చినావా?" - ఇంటర్వ్యూ కొనసాగించింది మా ఆవిడ.

"లేదండమ్మ. ఈ దేముడికి తొలి బంట్రవుతులం మేమే. పూజ్జేసే సాములు లచ్చుంపేట నుంచొత్తే మేం కొండ కాపక్కన ఏనాది గూడెం నుంచొత్తాం. వాళ్ళ మాదిరే మాదీ ఇలువరస. గుడి బీగం సెవులు మా కాడే ఉంటాయి. తెల్లారేప్పటికీడి కొచ్చి, బీగాలు తీత్తాం. చెత్తూడ్సి, నీల్లు జల్లేత్తాం. పూజకు పూలు దెచ్చి పెడ్తాం. పొయి మండెయ్యను పుల్ల లేరుకొత్తాం. అయ్యోరు సాయింతరం బస్సు కెళ్ళిపోతే, మేం బీగాలేసుకోని, సక్కా మా గూడాని కెళ్ళిపోతాం...."

"ఇంత పని చేసినందుకు దేవస్థానం వాళ్లు నీ కెంతిస్తారు?"

"హవ్... వ, నా బంగారుతల్లే. సాముల కిత్తే సాల్దా, ఆల్లు మా కేమిత్తారు? గుడిని కాపెట్టుకోనుండేటోల్లు గదా అని, దేముడికి చేసే ప్రెసాదంలో నాలుక్కవళాలు పెడ్తాడు సామి, ఏందో మీబోంటి మారాజులు పండో, ఫలారమో, పైసలే పడేత్తే సెయ్యి సాపతాం. అంతేనమ్మ. దేమున్ని నమ్ముకోని బతికేటోల్లం. ఈ దేముడున్నూ మా లాంటోడే"- వంటగదివైపు చూస్తూ అతడు బిగ్గరగా అరిచి చెప్పాడు - "ఏందయ్యా, కుర్రసాములూ, బస్సొచ్చేసింది నాయినా. జన మొచ్చేసివారు. నువ్వా వంటసాల్లో నుంచీ బయటపడేదుందా, లేదా?"

"ఏం మల్లయ్యా. ఇప్పుడేమైంది? నాకేమైనా చెవుడొచ్చిందా? కారుబారు చెయ్యకపోతే, మెల్లంగా చెప్పలేవూ?" లేత గడ్డంతో, నూనూగు మీసాలతో, ఇంకా వటువులా ఉన్న అర్చకస్వామి విసుక్కుంటూ బయటికి వచ్చాడు.

"అయ్యో. నా సామో. నే నేమంటి? జనమొచ్చినారని సెప్తి".

"వచ్చినారయ్యా. వచ్చినవాళ్ళు అయిదు నిమిషాలు కూచోరా? ఏం తొందర;"

"మా వరదాసారి ఇంతేనండమ్మ" సంజాయిషీ మొదలెట్టాడు మల్లయ్య. "ముక్కుమింద కోపం. మళ్లీ మనిషి బంగారు లాంటోడు".

"బంగారమే. కొంచెం కొంచెం గిల్లుకుందువుగానిలే, ముందా చెలమ చూపించు వాళ్ళకు. కాళ్ళు, ముఖము కడుక్కుని లోపలికి రమ్మను.... వరదాచారి మండపంలో దూరి మాకు కనిపించకుండా పోయాడు.

"అట్టనే.... మీ రట్టా కడప దాటుకోండమ్మ. బండల్లో సెలముంది. తేటగా, తియ్యంగా ఉంటాయి నీళ్ళు..."

నిజమే. కొండపూట నీళ్ళు గదా. అమృతంలా ఉన్నాయి.

చలువమండపంలో అడుగు పెట్టేసరికి మాపని ఏ.సీ. అపార్టుమెంటులోకి ప్రవేశించినట్టయి పోయింది. బార బారకూ స్తంభాలతో, బలిపీఠం, ధ్వజస్తంభం, గరుత్మంతుడి ఆవాసం, దేవతలవీ, ఋషులవీ విగ్రహాలు మొదలైన వాటితో ఆ మండపం కాస్తా ఇరుకుగా ఉంది. వెనుకవైపున మరీ చిరుచీకట్లు సందడిస్తున్నాయి. స్తంభాల నడుమ నిలబడి, అన్ని వైపులకూ తిరిగి చూస్తూ గర్భగుడి ఆచూకీ తెలుసుకోడానికి ప్రయత్నించాను. తోడి యాత్రికుల్ని అడిగి చూశాను. అందరమున్నూ కలిసి గర్భగృహం కోసం అన్వేషిస్తున్నాము. అప్పుడు పిలుపు వినిపించింది – "అయ్యబాబూ! రండి, లోపలికి రండి". అప్పుడైనా మాకు వినిపించింది వరదాచారి గొంతే. సవ్వడిని బట్టి గురిని ఛేదించే శబ్దభేది బాణాల్లా మేము పిలుపు వినవచ్చిన దిశకు నడిచాము. మండపానికి పశ్చిమ దిక్కున గోడకు బదులుగా నిల్చున్న పెద్ద బండరాతిలో ఒకచోట చీకట్లు కొంచెం పలచబారి ఉన్నట్టు తోచింది.

"పొండ, పొండ. అదే దోవ" – కూచున్న చోటునుంచీ కదలకుండా అరిచి చెప్పాడు ఏనాది మల్లయ్య. గర్భగుడికి ప్రత్యామ్నాయంగా రూపొందిన ఆ గుహ, ప్రవేశ ద్వారం దగ్గర మాత్రం కొంత విశాలంగా ఉండి, ఆ తరువాత ఉత్తరంగా మలుపు తిరిగింది. మనిషి తన చేతిని పైకెత్తితే తగిలేటట్టుంది పై కప్పు. భక్తులు నిల్చునే తావుకు అల్లంత దూరంలో ఒక రాతి అరుగు. వరదాచారి దానిపైన నిల్చున్నాడు. అతడి కెదురుగా ఉన్న గుహ గోడకు తాపడం చేసిన ఇనుప ప్రమిదలో దీపం ఒకటి, నిద్రమాంద్యంలో జోగినట్టు గుడ్డిగా వెలుగుతోంది. అతడి నడుమెత్తున గుహ చివరి భాగంలో గూడులాంటి తావు ఒకటి ఉంది. దానికేసి చూపిస్తూ "చూడండి. ఇదిగో స్వామివారు. ఆయన అంకపీఠంలో అమ్మవారు" అన్నాడు వరదాచారి. అర్చకుడు చెబుతున్నాడు గదా అని నమ్మవలసిందే గానీ, అక్కడ మాకు స్పష్టంగా ఏదీ కనిపించడం లేదు.

"ఆ దీపాన్ని కొంచెం ఎగదొయ్యగూడదా స్వామీ". పరితాపంగా అడిగింది మా వాగమణి.

"తొయ్యొచ్చు నమ్మా. తప్పేం లేదు. కానీ దేవస్థానం వాళ్ళు ఈ గుడి కిచ్చేది రోజు ఒకటికి నూరు గ్రాముల నూనె మాత్రం. దీపం ఏడెనిమిది గంటలైనా వెలగాలి

కదా. పొదుపుగా వాడుకోకపోతే, ఆ తరువాత చీకట్లో చిందులెయ్యవలసిందే, అదీ పరిస్థితి. ఏం జేద్దాం చెప్పు".

పగటివేళ కాంతుల్ని చిమ్మడానికి సూర్యుణ్ణి సృష్టించి, రాత్రివేళ వెన్నెలలు కురిపించడానికి చందమామను ఏర్పాటు చేసి, చాలని దానికి కోట్లాది నక్షత్ర దీపాలను ఆకాశాన వెలిగించి, తన చుట్టూ ఒక తేజోమయ ప్రపంచాన్ని నిర్మించిన వాడెవడైతే ఉన్నాడో వాడికి, నూరు గ్రాముల నూనెను దినవారీ కోటాగా కేటాయించిన మానవుడి ఔదార్యాన్ని గురించి తలచుకుంటూ నేను ఆశ్చర్యపడిపోయాను. మనిషి తనతోడి మనుషులతో ఆడుకున్నాడు. ప్రకృతితో ఆడుకున్నాడు. ఆఖరుకు నిరాకారుడు, నిర్గుణుడు, నిగమైక వేద్యుడు అయిన భగవంతుణ్ణి కూడా ఒక క్రీడా సాధనంగా చేసుకుని, ఆయనకు వివిధ రూపాలు కల్పించాడు. పెళ్ళిళ్ళు చేశాడు. సంతానవంతుణ్ణి చేశాడు. సంసార లంపటంలో దించాడు. మారువేషాలు వేయించాడు. అవుననుకుంటే హుండీలో డబ్బులూ వేశాడు. కాదనుకుంటే ఆయన సొమ్ములు, ఆస్తులూ దోచేశాడు. పరమాత్ముడనేవాడు నిజంగా గనుక ఉంటే, ఆయన ఈ మానవుడి పిచ్చి చెయిదాలను చూచి నవ్వుకుంటూ ఉంటాడు.

అర్చకుడు శోభనాద్రి దంపతుల పేరిట అర్చన వేయించాడు. మా పేరిట అర్చన జరిపించాడు. ఇన్నాంగ్లో మరొక్క అడుగు ముందుకు వేసి తన తల్లిదండ్రుల పేరిట అర్చన చేయించాడు. కర్పూరహారతి ఇస్తూ "స్వామి వారిని ఇప్పుడు చూడండి" అన్నాడు వరదాచారి. స్వామి అందంగా ఉన్నాడు. చిరునవ్వులు చిందిస్తూ ఆనందంగా ఉన్నాడు.

గర్భగృహంలో నుంచీ ఈవలికి వచ్చి, మేము తెచ్చుకున్న తినుబండారాలపైన పడ్డాము. పూటకూళ్ళావిడ కట్టి ఇచ్చిన పొట్లంలో అన్నమెక్కువై, పెరుగు తక్కువైపోవడం వల్ల ఊరగాయ ముక్కలతో తినగలిగినంత తిని మిగిలిన అన్నాన్ని మల్లయ్య కిచ్చేశాము. ఈలోగా మిగిలిన వాళ్ళు కూడా భోజనాలు ముగించేశారు. మోచేతిని తలగడగా పెటుకుని జగదాంబగారు సుఖంగా పవ్వళించేసింది. శోభనాద్రిగారు స్తంభానికి చేరగిలబడి నింపాదిగా దినపత్రిక చూచుకుంటున్నారు. వైష్ణవ దంపతులు బస్తీలో కొనుక్కున్న మల్లెపూలనూ, కనకాంబరాలను మధ్యలో పోసుకుని పూలపల్లకీలో కూచున్నట్లు ఎదురెదురుగా కూచున్నారు. పూలను పొందికగా చేర్చిపట్టి అతడందిస్తుంటే, ఆమె దండ కడుతోంది. మేము గర్భగుడివైపుగా అమర్చిన మెట్ల వరుసలో క్రింద మెట్టుపైన చెరొక వైపున కూచున్నాము. పూజాదికాలు ముగించుకుని వచ్చిన వరదాచారి పై మెట్టుమీద కూర్చున్నాడు.

ఆ దేవాలయ ప్రశస్తి ఏయే పురాణాల్లో ఉన్నదీ, ఆ దేవుడు ఏ యే రాక్షసుల్ని సంహరించిందీ, ఎందుకోసం ఆ కొండ గుహలో వెలసిందీ, ఎప్పుడెప్పుడు ఉత్సవాలు జరిగేదీ, సదరు గుడి ఎవరి యాజమాన్యంలో ఉన్నదీ, వాళ్ళెంత శ్రద్ధాసక్తులతో కైంకర్యాలు జరిపేదీ పూస గుచ్చినట్టుగా వివరించాడు ఆచారి. చివరకు "గంట మూడయిందాసార్. ఈ కొండల్లో అయిదింటికల్లా పొద్దుపోతుంది. నాలుక్కూ అయిదుకూ మధ్య బస్సెప్పుడో వస్తుంది. మీరు కిందికి వెళ్ళి రచ్చపైన కూచోండి సార్. ఇంతలో నేనూ గుడికి తాళాలు వేయించి, మల్లయ్యను పంపించేసి కిందికి దిగొస్తాను" అన్నాడు.

మబ్బులేవో అడ్డొచ్చి, వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా మారింది. కొండపైకి ఒక వస్తువును చేరవేయడం కన్నా, క్రిందికి దొర్లించడం సులువు కదా! ఈ న్యాయాన్ని

బట్టీ మేము సునాయాసంగా మెట్లు దిగి క్రిందికి వచ్చేశాము. మధ్యాహ్నం బస్సు తప్పించేసిన పడుచు దంపతులు రచ్చపైన కూచుని, ఏవో ఆంతరంగిక విషయాలను త్రవ్విపోసుకుంటున్నారు. వారితో బాటు ఉదయం మాకక్కడ కనిపించని శాల్తీ ఒకటి ప్రత్యక్షమైంది. ఎవరో ముసలావిడ. అరవై ఏళ్లుండొచ్చు. మాసిన చీర, భుజంపైన చిరిగిన రవిక, తైల సంస్కారం ఎరుగని పిడికెడు జుత్తు. చేవ కొయ్యతో చేసిన శిల్పంలా ఉంది. తనకు దగ్గర్లో మోదుగాకులతో నింపిన గోనె సంచి. బహుశా ఆ ఆకుల కోసమే అడవికి వచ్చి ఉంటుంది.

ఉదయం నుంచీ కలసి ఉండడం వల్ల మాతోడి యాత్రికుల మధ్య గల మానసిక దూరం తగ్గింది. బస్సు కోసం వేచి ఉండే అవకాశాన్ని పురస్కరించుకుని మాటల సందర్భంలో ఎవరికి వారు తమను గురించిన వివరాలను ఇతరులకు తెలియజెప్పుకున్నారు. శోభనాద్రిగారిది ప్రకాశం జిల్లా కందుకూరు. భూములున్నా ఆయన ప్రధాన వ్యాసంగం వ్యాపారం. జవుళి కొట్టుంది. శ్రీవైష్ణవులది తంజావూరు జిల్లా. రైల్వే ఉద్యోగిగా అతను సికింద్రాబాదులో నివసిస్తున్నాడు. పడుచు జంటది ఉదయం మేమెక్కిన బస్సు ఓ బస్తీలో బయల్దేరిందన్నానే, ఆ ఊరు. అబ్బాయి పేరు సారథి. అమ్మాయి అరుణ. ఒక మాసం కిందటే వాళ్ళకు పెళ్ళయింది.

ఇన్నాంగో గారి పిల్లలకు మనుషుల చరిత్రకన్నా కోతుల ప్రవర్తనే ఆసక్తిదాయకమై పోయింది. నేలపైన అవలీలగా తిరిగినట్టు నిటారుగా ఉన్న కొండపేటు ప్రక్క తలంలో చరచరా పైకెక్కి పోతూ, గబగబా కిందికి దిగేస్తూ ఒళ్ళు గోక్కుంటూ, పళ్ళికిలిస్తూ వివిధ భంగిమలు ప్రదర్శిస్తున్న కోతులవైపు చూస్తూ, పిల్లలు తమాషాలో లీనమై పోయారు. ఇంతలో ఓ హఠాత్సంఘటన ద్వారా కోతుల క్రీడ పరాకాష్ఠకు చేరుకుంది. నేరకపోయి సంచిలో నుంచి కొబ్బరిచిప్ప పైకి తీయబోయిన జగదాంబ గారిపైన దాడిచేసి, ఒక గండుకోతి ఆ చిప్పను కాస్తా ఎగరేసుకపోవడంతో బాటు, ముందరి కాలిగోళ్ళతో ఆమె చేతిని రక్తం వచ్చేటట్టుగా గీకేసింది. జగదాంబగారు కుయ్యో కుయ్యో మంటూ కేకలు పెట్టింది. శోభనాద్రిగారు చేతిగుడ్డతో రక్తాన్ని తుడిచేశారు. అయినా నెత్తురు స్రవిస్తూనే ఉంది. "అయ్యయ్యో, ఇప్పుడెలాగండీ? ఇలా యాత్రలకు బయల్దేరినప్పుడు మనం ఒక ఫస్ట్‌ఎయిడ్ బాక్సును తెచ్చుకుంటే పోయేది" అంటూ బెంబేలు పడిపోయాడు ఇన్నాంగో. అప్పుడు అడవిలో అశ్వినీ దేవతలా మోదుగాకుల ముసలావిడ మాకు అక్కరకు పనికివచ్చిన వైద్యురాలైపోయింది. "మీ రుండండయ్యా మరేం ఫర్వాలా. ఈ పసరు పిండేస్తే నెత్తురు నిలిచిపోతాది. మూడే దినాల్లో గాయం కనబడకుండా మానిపోతాది" అంటూ ఆవిడ గుప్పిట్లోని ఆకును నలిపి గాయం పొడుగునా పడేటట్టు పసరు పిండేసింది.

"ఏమవ్వా. ఈ వైద్యం ఎక్కడ నేర్చుకున్నావు?" అన్నాడు శోభనాద్రిగారు.

"అడవుల్లో తిరిగేటోల్లం గదయ్యా. పడితిమి, లేస్తిమి. కాలిరిగ, చెయ్యిరిగ, తేలు కుట్టె, పురుగు ముట్టుకునె. ఈడేం ఆసుపత్రులుండాయా? అంతా అచ్చాకు బుచ్చాకు వయిద్దిగాలే కదా. ఇటువంటివి ఇంకా కొన్ని వచ్చు నాకు...."

"ఈ మోదుగాకుల్ని నువ్వే జేసుకుంటావు? విస్తర్లు కుట్టి అమ్మేస్తావా?" - ఇంటర్వ్యూ చేయడానికి మరొక అవకాశం దొరికిపోయింది మా ఆవిడకు.

"లేదండమ్మ. ఆకుల్నే అమ్మేస్తా. అయిదు రూపాయలొస్తాయి. అందులో రెండ్రూపాయలు బస్సు ఛార్జికే సరిపోతుంది..."

మా ఆవిడ రాబట్టిన జవాబుల ద్వారా ఆ ముసలావిడను గురించి మరికొన్ని విషయాలు తెలిసొచ్చాయి. ముసలిదాని పేరు అచ్చమ్మ. నివాసం లచ్చంపేట.... కట్టుకున్నోడు కాలమైపోయినాడు. కొడుకులుండారు. ఎందుకమ్మా బిడ్డలు? కన్నతల్లికి పట్టెడన్నం పెట్టని బిడ్డలు మట్టిగెడ్డలతో సమానం. ఉదయం బస్సులో తానీ అడివి కొస్తుంది. కింది నుంచీ దేముడి కొక దండం పెడుతుంది. ప్రొద్దు తిరిగేటప్పటికి గోతం నిండా మోదుగాకులు కోసుకుంటుంది. సాయింతరం బస్సులో తిరిగెల్లిపోతుంది. కరువు లొచ్చినాయి. తానేం సచ్చిపోలా. పుట్టించినోడు బువ్వపెడతానే ఉండాడు...

కోతుల క్రీడల్ని చూచి ముఖం మొత్తిన పిల్లలు, ఇప్పు డాకాశం వైపు చూస్తున్నారు. ఉండి ఉండి ఉద్వేగంతో అరిచాడు శీను - "చూడవే పద్దక్కా ఆ మబ్బు ఎలుగ్గొడ్డులా లేదూ?"

"అవునాః శీనూ. కాళ్ళూ, చేతులూ, తల-నిఝంగా ఎలుగ్గొడ్డే. లేచి నిలబడి నడుస్తున్నట్టుంది గదూ".

"అద్దిరభన్నా - ఎలుగ్గొడ్డుకు తల ఊడిపోయిందోచ్..." చేతులు చరుస్తూ నవ్వసాగాడు గోపులు.

"అయ్యో, ఎవరో తల నరికేసినట్టున్నార్రా పాపం" - వాపోయింది పద్మ.

వసంతం రాగానే చెట్లు చిగురించినట్టుగా ఆకాశాన మబ్బులు నడయాడేసరికి, మందమారుతాలు మేలుకున్నాయి. పదివేలమంది చేటీకలు చుట్టూరా నిలబడి కొండపైని దేవుడికి వింజామరలు వేసినట్టు, చెట్లన్నీ కదలుతున్నాయి.

సరిగ్గా నాలుగ్గంటలకు చిన్న సంచీ ఒకటి చేతబట్టుకుని వరదాచారి కూడా కిందికి దిగి వచ్చేశాడు.

"వస్తివా అల్లుడా." చేతులు చాస్తూ ఆహ్వానించింది అచ్చమ్మ.

"ఆ సంచిలో ఉండేదేదో ఇట్టా పారెయ్యరాదా! తెల్లా రెప్పుడో తిన్న చద్దన్నం. కడుపు మండిపోతా ఉండాది. దినమ్మూ నువ్వే తినాల్నా? నీ మాదిరి నేమ్మాత్రం దేవుణ్ణి కాపెట్టు కోలేదా?"

"ఛీ ఛీ, నోర్ముయ్". కసురుకున్నాడు వరదాచారి.

"ఇదిగో ఆఖరుసారిగా చెబుతున్నా. ఇంకొకసారి అట్లా పిలిచినావో, మల్లయ్యతో చెప్పి మక్కెలిరగ దన్నిస్తా..."

"ఓయబ్బో, వాడెవుడయ్యా బోడి మల్లయ్య. ఇంకా కావలిస్తే నువు తిట్టు. నువు కొట్టు. అంతేగానీ ఇంకొక డెవుడైనా నాపైన చెయ్యెత్తితేనా?"...

"ఏం జేస్తావే నంగనాచిముండా. జాస్తీ మాటాడితే నేనే నిన్ను గొంతు నులిమి..." గుక్కత్రిప్పుకోకుండా వచ్చిన దగ్గువల్ల వరదాచారి కోపావేశం అర్ధాంతరంగా తునిగిపోయింది. "చంపెయ్యి నాయినా. చంపినా వదిలి పెట్తానా? చచ్చి నీ కడుపున పుడతా..." "దరిద్రపుగొట్టు మొగమా! నువ్వా నా కడుపున పుట్టేది? అట్లా కాదులే. కండక్టరుతో చెప్పి ఈ గోనెసంచీ లగేజీతో నిన్ను బస్సెక్కనీకుండా చేస్తా, చూడు..."

"నాయినా, ఇదేం గుడి మేలం కాదే. నగరి మేలం. బస్సెవురిది; కండట్టరుదా? మందినాయినా బస్సు. ఒద్దు, గిద్దూ అంటే మల్లీ ఈ రూటులో పోవద్దూ".

"చాల్చాల్లేవే ముసిల్దానా. మోచేతికి మీసాలొచ్చినట్టు మాటాడక. ముక్కూ, నోరూ మూసేస్తే రెండు నిమిషాలు పట్టదు...." ఈ వాక్యానికి కూడా పూర్తయ్యే యోగం

లేకపోయింది. తల పైకెత్తి కళ్ళు మూసుకుంటూ ఒళ్ళంతా అదిరిపోటట్టుగా తుమ్మేశాడు వరదాచారి.

"అయ్యో, బిడ్డ తలకాయ లేత టెంకాయ అయిపోయిందమ్మా. పాపం అంత లావు పడిశెం ఎందుకు పట్టింది వరదయ్యా? ఒక ఆకు తెస్తానుండు. వాసన సూద్దువు గానీ..."

"చాలన్దానికి నీ దగ్గర వైద్యం గూడానా. దగ్గరికొచ్చినావంటే మూతిపళ్ళు రాలగొడ్తాను...."

బ్రహ్మచారికీ, వృద్ధనారికి జరుగుతున్న సంవాదానికి ఫుల్‌స్టాపు పెట్టాలని అనిపించినట్టుంది శోభనాద్రి గారికి – "కుర్రస్వామితో నీ కెందుకు గానీ, అచ్చమ్మా మా సంచిలో అరటిపళ్ళున్నాయిలే తీసుకుందువు రా" అన్నాడు.

"ఒద్దు బాబూ. ఈ కోతుల్దగ్గర సేతికి దక్కింది, నోటికి దక్కదు. లచ్చంపేటలో దిగేప్పుడు తీసుకుంటాలే...."

"నేనూ అందుకనే కొబ్బరి ముక్కలు పైకి తీయాలనుకుని కూడా మానుకున్నా. లచ్చంపేటలో ఇస్తాలే, అచ్చమ్మా" అంది మా ఆవిడ.

"మా దగ్గర కాస్తా పులిహోరా ఉంది" అంది వేదవల్లి.

"వద్దొద్దు. దాని కేమీ ఇవ్వకండి. అది దొంగముండ" అంటూ రుసరుసలాడి పోయాడు వరదాచారి.

రచ్చకూ, కోనేటికీ మధ్య ఆడుకుంటున్న పిల్లల్లో నుంచీ ఓ అబ్బాయి 'పడింది పడింది' అంటూ ఎగిరి గంతెయ్యడంతో మా ధ్యాస అటువైపు తిరిగింది. వేలిని మెడపైన ఆన్చి 'ఇక్కడ పడింది' అంటున్నాడు శీను. గోపులు తల కొంచెం ఒత్తిగించి చెంపపైన చూపెడుతూ 'నా కిక్కడ పడింది' అన్నాడు.

"ఏమిట్రా పడింది?" అంటూ ప్రశ్నించింది వేదవల్లి.

"చినుకులమ్మా వానచినుకులు"

హఠాత్తుగా మా ఆవిడవైపు చూసి, ఆమె ముఖం వివర్ణమై ఉండడం గమనించి నేను కంగారుపడిపోయాను. "ఏమైంది నాగమణీ. రచ్చపై కొచ్చి కూర్చున్నాక నీలో మాట్లాడే ఉత్సాహం బాగా తగ్గిపోయిందే. అదొక మాదిరిగా ఉన్నావెందుకు?" అని అడిగాను.

"ఏమిటోనండీ. నాకు చాలా భయంగా ఉంది" అంది నాగమణి. ఆ మాట కూడా నా చెవికి మాత్రం వినిపించేటట్టు చాలా రహస్యంగా చెప్పింది.

"ఎందుకు భయం?"

"చూడండి, మబ్బు లెట్లా ఎక్కుతున్నాయో?"

'మబ్బు లెక్కుతున్నాయి' అంటే పరిస్థితిని వీలయినంత తేలిక చేసి చెప్పినట్టే ఉంది. నిజానికి వందలాది కారెనుముల్నీ, మదపుటేనుగుల్నీ ఒక మైదానంలో క్రిక్కిరిసిపోయేటట్టుగా నిలబెట్టినట్టుంది – ఆ దృశ్యం. కారుమబ్బులు క్రమ్ముకున్న ఆకాశం మరీ చిన్నదైపోయి, ఆ పైకప్పు కాస్తా కొండల పైకి వచ్చి వాలిపోయినట్టుంది. కొండల గోడల నడుమ, కారుమబ్బులపైకప్పు కింద ఆ లోయ ఒక మాయలమరాఠీ వాడి గుహలా తయారైపోయింది. పొద్దుగుంకే సమయం ఆసన్నమై ఉండొచ్చు. బస్సొచ్చె జాడలేవీ కానరావటం లేదు. బయటకు వెళ్ళే దారిలేక, ఈ గుహలో తగులుకపోతే మా గతేం

కావాలి! కరెంటు షాకు లాంటి ఓ భయవీచిక నాలోనూ విసురుగా పారాడింది.

వడగండ్లు రాలినట్టుగా 'టప్పు టప్పు' మంటూ ఉబ్బచినుకులు నేలపైన రాలసాగాయి.

"ఏం సామీ. బస్సెప్పుడైనా రాకుండా ఆగిపోవడం కద్దా?" వాకబు చేసింది నాగమణి.

"ఇంతవరకూ ఎప్పుడూ అట్లా జరగలేదమ్మా. ఆరు నూరైనా, నూరు ఆరైనా బస్సు రావాలి. యాత్రీకులొచ్చినా, రాకపోయినా పూజారి అనేవాడు ఒకడు ఇక్కడుంటాడని ఆర్టీసీ వాళ్ళకు తెలుసు. రాత్రుల్లో ఇక్కడ నరసంచారం ఉండదనీ తెలుసు...."

"ఏమిటో స్వామీ. మీరున్నారు గనుక మాక్కాస్త ధైర్యంగా ఉంది" అన్నారు శోభనాద్రిగారు.

అచ్చమ్మ కిసుక్కున నవ్వింది. "ఈ ఒంటి ఊపిరి బాపనాయనకు ఎక్కడలేని భయం బాబూ. సాలన్దానికి ఒంట్లో కూడా బాగుండేట్టు లేదు. బస్సు గనక వొస్తే సరిపోయ. లేకుంటే ఈయనకే మనం కావిలుండాల..."

"ఓసి, చుప్పనాతి ముండా. నీతో పెద్ద ఎవ్వారమైపోయిందే నాకు..."

"తిట్టాదు సామీ. నీకూ, నాకూ ఒక నాటితో తెగిపోయేదా? నువ్వు మొదట వీళ్ల సంగతి జూడు. దేముణ్ణి నమ్ముకోని వచ్చినోళ్ళు, వానొస్తా ఉంది... వొచ్చేసింది. తడిసి ముద్దైపోతారు పాపం..."

"చాకిరేవు బానంత నోరుంటే సరిపోయిందా? ఆ చూచే దేదో నువ్వే చూడరాదూ?"

"అదీ, ఆ మాటనినావు బాగుంది" – అచ్చమ్మ వానచినుకుల్ని దూసుకుంటూ వెళ్ళి, రెండు గుండ్ల మధ్యలో నుంచీ ఓ తాటిమట్టల ఆచ్ఛాదనాన్ని పైకి తీసింది. తాటిమట్టల్ని ఒక చాపలాగా చేర్చి కుట్టి, దాన్ని మడిచి పైవైపున మాత్రం అంటగడతారు. దేశవాళీ రెయిన్ కోటు అనొచ్చు. దాని పేరు గూడచాప..."

ఆ గూడచాపను బాగా దులిపి, తలకు తగిలించేసుకుంది అచ్చమ్మ. తిరిగి వచ్చి దారిలో నిల్చుంది. "అయ్యలూ, నేం చెప్తా ఉండా, ఇప్పుడింక నాలుగు పదున్ల వానపడినా నేం తడవను. ఎవరికైనా ఒకరికి ఈ గూడ సాపిచ్చేసి, నేం గావాలంటే తడుస్తా. అయితే అందరూ తడవకుండా ఉండాల్నంటే – నే జెప్పినట్టు జెయ్యాల..."

"చెప్పు. ఏం చెయ్యాలి? తడిస్తే పిల్లలకు జబ్బు చేస్తుంది. తొందరగా చెప్పు?..." అంటూ గింజుకున్నాడు ఇన్నాంగో.

"అయితే రండి. నాతోగూడా రండి" – విడిచిపెట్టిన బాణంలా పైకి వెళ్ళే మెట్లవైపు పరతెంచింది అచ్చమ్మ.

"వద్దు దాని మాట వినొద్దు. అదిగో, ఆ విడిది మండపంలోకి వెళ్ళబోతూ ఉందది..." వారించాడు వరదాచారి.

"తీరా మనం అక్కడికి వెళ్ళాక బస్సొస్తే.... " తనలోని ఆశాభావాన్ని బయటపెట్టింది నాగమణి.

"అందుకనే చెబుతున్నా బస్సొస్తే మళ్ళీ దిగి రావడం కష్టం. ఇక్క దుండడమే మంచిది..."

ఏం మంచిది – అని ప్రశ్నించినట్టుగా వాన విజృంభించింది. కాసేపు సూదుల్లా పొడిచి, కాసేపు దబ్బనాల్లా కుమ్మిన వానచినుకులు చూస్తూ చూస్తూ ఉండగానే తమ

రూపాన్ని కోల్పోయి, గాలివాటును బట్టి తెరలు తెరలుగా మారి, తేపలు తేపలుగా వచ్చి ఆపాదమస్తకం మమ్మల్ని మర్దించేశాయి. వాటి దెబ్బకు దూదిపింజల్లా కొట్టుకపోకుండా ఉండడంకోసం రావిచెట్టు బోదెను ఆశ్రయించి దాన్ని వీలయినంత వరకు అబ్బళించి పట్టుకున్నాము. తిరిగి చూస్తే వాననీళ్ళు ముక్కుల్లోకి, కళ్ళలోకి జొరబడడం ఖాయం. అందువల్ల మేము కళ్ళు మూసుకుని ఉష్ట్రపక్షులంలా ఆ చెట్టు బోదెకే అంటుకపోయాము.

అలా అర్ధగంటే గడిచిందో, ముప్పావు గంటే గడిచిందో తెలియదు. ఆ వ్యవధిలో మేము వర్షం తీవ్రరూపం ధరించినప్పుడు మానవుడి భౌతికశక్తి ఎందుకూ కొరగాదని గ్రహించాము. అప్పటికి ఎంతగా తడవవచ్చునో అంతగా తడిసి, ముప్పందుమై పోయాము. చెట్టుబోదె పూర్తి రక్షణ ఇవ్వకపోయినా మా ప్రాణాలను కాపాడగలిగింది. బహుశా ఇది మొదటి హెచ్చరిక అయినట్టు వాన హోరు కాస్తా తగ్గినట్టు తోచింది.

దక్షిణపు వైపు కొండపేట పైన విడిది మండపాని కీవలగా అప్పుడొక ఆకారం మసకచీకట్లో లీలగా ప్రత్యక్షమైంది.

మొదట గొంతే వినిపించి ఉండాలి. తల పైకెత్తే సరికి ఆకారం కనిపించింది.

"రండి బాబూ రండి. సెట్టును నమ్ముకోవద్దు. గాలి బలమైతే కొమ్మలిరిగి పోతాయి. అన్నాయంగా సచ్చిపోతారు. నా మాటినండి. వాన పడదు గదా అని పేటు కింద లొక్కిల్లోకి మెడనైనా దూర్చేరు. పైన చల్లగా వాన నీళ్ళు తగిలేటప్పటికి, పాములు కిందికి దిగొచ్చేస్తాయి. రాళ్ళు జారి పడొచ్చు. పిల్లపాపలుండారు. బిరీన రండి నాయనా. సీకటి సిక్కబడితే మళ్ళీ దోవ తెల్దు. దేముళ్ళు సల్లంగా సూసి వానగూడా కొంచెం తగ్గుముఖం పట్టింది. మళ్లీ బలమైందో, ఈ అడవిలో దిక్కులేని సావే. ఒకరి నొకరు పట్టుకోండి. జాగరత్తగా, అడుగులేస్తా పైకొచ్చెయండి. ఈడేం బయంలేదు. మీ పాణాలకు నా పాణం అడ్డేస్తా..."

"కానీ మే మక్కడి కొచ్చేశాక బస్సొస్తే... మళ్ళీ దిగి రావద్దూ?" - గొంతు చించుకుంటూ అడిగారు శోభనాద్రి గారు.

"ఏం ఫర్వాలేదు. మనమందరం గొంతు కలిపి అరిస్తే బస్సోడికి ఇనిపించకపోదు. బస్సు గిస్సూ తర్వాత. ముందు మీరొచ్చెయండి...."

అచ్చమ్మ మాటనే అడవి తల్లి ఆనతిగా భావించినట్టు ఇన్నాంగో భార్యా బిడ్డల్ని పొదివి పట్టుకుని మెట్లవైపు సాగిపోయాడు. శోభనాద్రి దంపతులు వాళ్ళ అడుగు జాడల్నే అందిపుచ్చుకున్నారు. సారథి, అరుణ వాళ్ళని వెంబడించారు. నాగమణికి ఎంతగా ఇష్టం లేకున్నా, గత్యంతరం లేక మేమున్నూ మిగిలిన యాత్రికులను అనుసరించాము.

తాటాకు రెయిన్ కోట్‌లో దూరుకున్న అచ్చమ్మ మా రాకకోసం పైమెట్టు దగ్గర వేచి చూస్తూ ఉంది.

"వొచ్చేసినారా? అందరూ వొచ్చేసినారా?" - ముఖాల్లోకి చూస్తూ రావలసిన వాళ్ళందరూ వచ్చేసినట్టు గుర్తిస్తూ వచ్చిన అచ్చమ్మ చిట్టచివర "ఏదీ, కుర్రసామేదీ?" అంటూ ఆక్రోశించింది. "అయ్యో కొంప ముంచినాడు గదమ్మా. అసలే ఒల్లు బాగులేదు. పాపం" అంటూ విసవిసా క్రిందికి దిగిపోయింది.

మెట్లెక్కి మండపంలోకి వెళ్ళేసరికి మాకు మునుగుతూ తేలుతూ కొట్టుమిట్టాడుతున్న వాళ్లకు సముద్ర గర్భంలో ఒక పడవ దొరికినట్టయింది. ప్రస్తుతానికి గండం గడిచినట్టే కానీ, ముందు గతి? మండపంలో అడుగు పెట్టామే గాని, మేము నిబ్బరంగా పరిసరాల్లోకి

చూడలేకపోయాము. దడదడలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకోలేక, ఖిన్నవదనులమై గుబులు గుబులుగా నేలచూపులు చూస్తూ ఒకరి కొకరం అనుకున్నట్టుగా నిల్చున్నాము.

చీకటి చిమ్మచీకటిగా మారింది. ఉధృతం తగ్గినా వాన జల్లులు జల్లులుగా పడుతూ ఉంది.

ఆ చీకటిలో, చిత్తడిలో 'ఊఁ, పట్టుకో... నడు... ఇంకెంత... రెండడుగులే..." అన్న మాటలు వినిపించి, అవి వినిపించిన చోట రెండు ఆకారాలు కనిపించినట్లై, కళ్ళు పొడుచుకున్నట్టుగా ఆ వైపుకు దృష్టి సారించాము. "జొరంతో ఒల్లు పెట్లిపోతా ఉందమ్మా బిడ్డకు. మెట్లెక్కి రాలేక దోవలోనే గసపోసుకుంటూ ఉండాడు. ఇప్పుడైనా నడిసొచ్చినాడా? అలాగ్గా ఎత్తుకొచ్చేసినా ననుకో...." ఇంచుమించు స్వగతంలా పలుక్కుంటూ అచ్చమ్మ వరదాచారిని మండపంలోకి చేరవేసింది.

అచ్చమ్మ రాకతో మాకు కొంచెం ఊపిరి సల్పినట్టయింది.

"నాయిన్నాయినా. ఇంకా తడి బట్టల్లోనే ఉండారా. ఇప్పేయండిప్పేయండి. ఇప్పేసి అవిట్నంతా కూసం దగ్గిర పడెయ్యండి. పెట్టెల్లో బుట్టల్లో పొడి బట్టలేవైనా ఉంటే తీసి చుట్టుకోండి.... బాబయ్యా మీకు పున్నెముంటుంది. వరదయ్యకు మారు పంచలేదు. చలిజొరమొచ్చేసింది. ఒక పంచ నాయవా. ఎవురిచ్చినా సరే...."

అయ్యవారు లేనప్పుడు క్లాసును చూసుకునే లీడరులా దిక్కులు దోచని ఆ పరిస్థితిలో మా పాలిటికి అచ్చమ్మే నాయకురాలైపోయింది. బుద్ధిగా ఆమె చెప్పినట్టు చేశాము. తడిబట్టల స్థానంలో పొడిబట్టలొచ్చేశాయి. ఇన్నాంగో ఇచ్చిన పంచను చుట్టుకోమని చెప్పి. శోభనాద్రి గారి శాలువాను ఒంటి నిండుకూ కప్పి, తన గూడ చాపను ఎస్కిమో వాళ్ల గుడిసెలా నిలబెట్టి వరదాచారిని అందులోకి ఒదిగించేసింది అచ్చమ్మ. ఒకరికి పదిమంది ఉన్నాం గదా అన్న స్పృహ ఒకటి మాత్రమే కొడిగట్టిన ధైర్యదీపంలా మా అంతరాల్లో మినుకు మినుకుమంటూ ఉంది. ఆ స్పృహ మరింత దట్టం గావడం కోసం ఒకరికొకరం అతుక్కుపోయినట్టు మండపం నడుమ కూలబడి, చెక్కిపెట్టిన రాతిబొమ్మల్లా బిగుసుకపోయాము.

గంట ఏడయింది.

"అయితే బస్సేమై ఉంటుంది?" గుసగుసలాడినట్టుగా ప్రశ్న వినిపించింది. బహుశా శోభనాద్రి గారి గొంతే అయి ఉండాలి.

"సందు దొరగ్గానే లారీ కెక్కించేద్దామని దొంగనాసవితి బిడ్డలెవురో రోడ్డు పక్క సెట్లను సగం ముక్కాలు వాసి దాకా నరికేసి ఉంటారు. సాయంత్రమొచ్చిన గాలివాన కది పడిపోయి ఉంటుంది. సెట్టడ్డం పడితే ఇంక బస్సెట్టా వస్తుంది?" అంది అచ్చమ్మ.

"రాత్రికింక మనగతి?"

చాలా చిన్న ప్రశ్నే. ఎక్కడో లో గొంతు నుంచి వినిపించీ వినిపించకుండా వెలువడిందే! కానీ ఉండి, ఉండీ ఒక మెరుపు మెరిసి, ఆ వెల్తురులో చెట్లు జీబు దయ్యాల్లా, గుండ్లు క్రూర మృగాల్లా, కారుమబ్బులు క్రమ్ముకున్న ఆకాశం నోరు తెరచుకున్న కాళ రాక్షసిలా కనిపిస్తుంటే - ఏ పొదలో అలికిడైనా ఉలికి పడుతూ, ఏ అపాయం విరుచుక పడుతుందోనని హడలిపోతూ, చేతుల్ని డొక్కల్లో దాచుకుని, ఊపిరి బిగపట్టుకుని, దిగాలు పడిపోయి కూచున్న మాకు ఆ చిన్న ప్రశ్న వెయ్యి మెగాఫోన్లలో నుంచీ ఒక్కసారిగా వెలువడి, చెవుల్లో సొచ్చి అక్కడే గింగుర్లు తిరుగుతూ కాపురం పెట్టేసినట్టుంది.

కాలం గనుక కరడుగట్టిన నేలబొగ్గు గుట్టలుగా ఘనీభవిస్తే ఎలా ఉంటుందో మాకప్పుడు తెలిసింది. నిమిషాలు గడుస్తున్న కొద్దీ కళ్ళు చీకటికి అలవాటు పడిపోయాయి. విపరీతమైన భయాందోళనల వల్ల మనసు మొద్దుబారిపోయింది. మెల్లగా కనురెప్పలు మాత్రం పైకెత్తి చుట్టూరా కలయజూడడానికి ప్రయత్నించాను. కానీ కనిపించడానికేముంది? వట్టి చీకటి. కారు చీకటి, కటిక చీకటి అంటూ పర్యాయ పదాలెన్ని ఏకరువు పెట్టినా చీకటిని కళ్ళకు కట్టినట్టుగా వర్ణించినట్టవుతుందా? నిజమైన సాంద్రమైన ఒక్కింత వెలుగురవ్వకైనా నోచుకోని ఆ చీకటిని వర్ణించడానికి నుడికారాలు గానీ, ఉపమానాలు గానీ, ఉత్ప్రేక్షలు గానీ పనికి వచ్చేటట్టు లేవు. వర్ణన లన్నింటినీ త్రోసిపుచ్చి అఖండమైన, అవిభాజ్యమైన, అనంతమైన నీరంధ్ర నిబిడాంధకారం అంటే ఆ భావన సత్యానికి చేరువగా ఉండొచ్చు.

కంటి చూపుకు చీకటి ఆనకట్ట వేస్తే, గాలి హోరు మా చెవులపైన తిరుగులేని ఏలుబడిని సాగిస్తూ ఉంది. ఆనాటి సాయంకాలం వింజామరలు వీచినట్టుగా ప్రారంభమైన గాలి, ఎనిమిది గంటలయ్యేటప్పటికి ఆకులు ఆకులూ రాసుకోగా, కొమ్మలు కొమ్మలు ఒరుసుకోగా, చెట్లూ చెట్లూ మోదుకోగా తీవ్ర ఝంఝానిలంగా పరిణమించి, అంధకార రంగస్థలానికి నేపథ్య ఘోషగా రూపుదాల్చింది. ప్రారంభం కానున్న భయంకర నాటకానికి సంబంధించిన ఇతర హంగులుగా, కరవాలాలు తిప్పినట్టు మెరుపులు, ప్రళయ భేరీ భాంకారాలు నినదించినట్టు ఉరుములు, మందుగుండు సామాన్లు ప్రేలినట్టు అశనిపాతాలు అన్ని వైపుల నుంచీ పుంజుకున్నాయి. ప్రాణిలోకం పైన ప్రకృతి ప్రకటించిన యుద్ధానికి ఇలా మోమహరింపు సిద్ధమైపోయిన తర్వాత, అంతవరకూ నీటిని జల్లెడపడుతూ వచ్చిన ఆకాశమనే రిజర్వాయరుకు హఠాత్తుగా అడుగు చట్రం ఊడిపోయినట్లై కుంభవృష్టి ప్రారంభమై పోయింది.

మెరుపుల వల్ల కళ్ళు బైర్లు క్రమ్మి అంధత్వం ఎక్కడ ప్రాప్తిస్తుందోనని మేము కనురెప్పల కవాటాల్ని గట్టిగా బిగించేశాము. ఉరుములు చేసే ఆర్భాటాల వల్ల గుండెలెక్కడ వ్రయ్యలైపోతాయేమోనని చెవుల్లో వ్రేళ్ళు పెట్టుకున్నాము. సాధారణంగా ఎత్తైన చెట్లపైన కట్టడాలపైన పిడుగులు పడతాయనుకోడం విదితమే. పిడుగుపాటు వల్ల మేము కూచున్న మండపం ఎక్కడ కూలిపోతుందోనని స్వేచ్ఛగా ఊపిరి పీల్చడం కూడా మానేశాము. తిక్కరేగగొడుతున్న తుఫాను గాలివల్ల తేపలు తేపలుగా వచ్చి కత్తులు ఝుళిపించినట్టుగా మమ్మల్ని తాకుతున్న వాన తెరల బారి నుంచి రక్షణ పొందడం కోసం చేతికి దొరికిన బట్టల్ని ఒంటి నిండుగా కప్పుకుని, అందరమూ ఒకే ఒక తడిబట్టల మూటగా బిర్ర బిగిసి, ముడుచుక పోయాము.

"ఏమిటది? ఎవరైనా ఏడుస్తున్నారా?" చాలా తగ్గుస్థాయిలో వినిపించడం వల్ల ఆ ప్రశ్న ఎవరిదో పోల్చుకోలేక పోయాను. "ఏమండీ. మనం క్షేమంగా ఇల్లు చేరే యోగం ఉందంటారా?" ఈ మాటల్ని బట్టి లోగొంతుకతో వెక్కి వెక్కి ఏడుస్తున్నది మా ఆవిడేనని నా కవగతమైపోయింది. బిగించిన వీణాతంత్రులలో ఒకటి స్పందించగానే, మరొకటి కూడా స్పందించినట్టు అంతలో ఇంకొక గద్గద స్వరం వినిపించినట్టయింది. "వద్దంటే విన్నారు కాదు. ఈ అడవిలో దిక్కులేని చావైపోయింది" అంటూ వాపోతూ ఉంది జగదాంబగారు. "ఇన్నాంగో? పసంగో" (ఏమండీ బిడ్డలు) అంటూ ఆక్రోశించింది. వేదవల్లి. మరైతే సారథి దంపతులేమైనట్టు? మాతోబాటు మండపంలోకి వచ్చారు గదా,

'నాయనా సారథీ' అన్నాను. "ఉన్నానండీ. అరుణ హారం పట్టింది. మాటాడదట. జీవితంలో ఇంక నాతో కూడా ఎక్కడికీ రాదట" అంటూ పరితాపం వెలిబుచ్చాడు సారథి.

"నువ్వెక్కడున్నావు అచ్చమ్మా?" అని అడిగాను.

"ఉండాను నాయినా. ఈ వాన ఇట్లా ఎంతసేపు కురుస్తాదో తెలవకపోయ... శాలువా కప్పినా నిలవలా. గూడసాప పెట్టినా నిలవలా. వరదయ్య సలికి ఎగిరెగిరి పడతా ఉండాడు. "వాల్లమ్మకూ, అయ్యకూ ఒకడే కొడుకు. పైనెల్లో పెండ్లి గూడా పెట్టుకోనుండారు" అంది అచ్చమ్మ.

వాన జోరుకు, గాలి హోరుకు తోడుగా మరొక అలజడి ఏదో మొదలైనట్టు చాలా సేపట్నుంచి ఒక అనుమానం ఉండిపోయింది. ప్రవహించే నీళ్ళ చప్పుడు. ఒకసారి మెరుపు మెరిసినప్పుడు ప్రయత్నపూర్వకంగా కళ్ళు తెరిచాను. కొండల పైనుంచి వందలకొలది జలధారలు బండలపైన జారుతూ, పొదల్లో దూరుతూ, చెట్లు ఎదురైనప్పుడు మలుపులు తిరుగుతూ గోధుమ వన్నె సర్పాల్లా క్రిందికి దూకుతున్నాయి. ఇక కొండవాగు సంగతి సరేసరి. అది అచ్చంగా ఆదిశేషుడి అవతారమే ఎత్తినట్టుంది. అది జలపాతంగా మారే చోటు మేము తలదాచుకున్న మండపానికి కొద్ది బారల దూరంలోనే ఉంది. బలవంతులు కొందరు ఒక బ్రహ్మాండమైన నగారా చుట్టూ నిలబడి, పేట్రేగి పోయేటట్టుగా బాదేసినట్టు జలపాతపు చప్పుడు వినవస్తూంది. అక్కడి నుంచి చివాలున లేస్తున్న నీటి తుంపరలు కొద్ది గజాల పర్యంతం పైకెగిరి గాలికి ఆరుతున్న జరీ గుడ్డను తలపిస్తున్నాయి.

ప్రకృతి గనుక భీభత్సం కొనసాగించాలనుకుంటే దానికింక హద్దూ, పద్దూ ఉండదనీ, చివరిస్థాయిలో అదే ప్రళయమనీ ఎక్కడో చదివిన మాట నాకు జ్ఞప్తికి వచ్చింది. నదులకు వరదలు వచ్చినప్పుడు, సముద్రాలు పొంగినప్పుడు, భూకంపాలు సంభవించినప్పుడు, అగ్నిపర్వతాలు ప్రేలినప్పుడు, చండమారుతాలు వచ్చినప్పుడు మానవుడెంత నిస్సహాయుడో తెలిసొచ్చింది. బలమైన రాతి మండపం ఒకటి దొరికిపోయింది కనుక సరిపోయింది గానీ, లేకపోతే ఆ రాత్రి మాగతి యమధర్మరాజు చిట్టాకు పని కల్పించేదే. బ్రతికి బట్టగట్టడమంటూ జరిగిందంటే అందుకు కారణం ఒకటే. భూమిపైన నూకలు ఇంకా బాకీ ఉండడం.

గంట పది కావచ్చేటప్పటికి మా చుట్టూరా నెలకొన్న బీభత్సం కాస్తా తగ్గుముఖం పట్టినట్టు తోచింది.

సరిగ్గా ఆ దశలో కుక్షిలో నివసించే ఆత్మారాముడు మేలుకున్నాడు. వాడు మేలుకుంటున్నాడని ఇన్నాంగో గారి చిన్నబ్బాయి ఏడుస్తూ లేచి కూచోడం ద్వారా మేము గ్రహించాము. "ఏరా గోపులూ. ఏం నాన్నా, ఏం కావాలి?" అంది తల్లి. "ఆకలిగా ఉందమ్మా. తినడానికేమైనా ఇవ్వవూ?" అన్నాడు గోపులు. "నాకూ ఆకలేస్తోందే అమ్మా!" అంటూ తమ్ముడితో శ్రుతి కలిపాడు శ్రీను. నోరు తెరిచి అడగలేదు కానీ, కప్పుకున్న బట్టను తీసేసి పద్దు తలపైకెత్తింది. "అయ్యో, తినడానికి లేకేమర్రా. పులిహోర చెడిపోయిందేమో గానీ, బిస్కట్ పొట్లాలున్నాయి కదా. ఇన్నాంగో, సపోటా పజం ఎంగె ఇరుక్కో పారుంగో. (ఏమండీ. సపోటా పండ్లెక్కడున్నాయో చూడండి.)" అంటూ బుట్టలోని వస్తువులన్నీ పైకి తీయసాగింది వేదవల్లి. "మా దగ్గర అరటిపళ్ళున్నాయమ్మా. ఆకలికి అరటిపండు దివ్యౌషధం కదా. దేవుడికి కొట్టిన కొబ్బరికాయలు కూడా సంచుల్లో ఉండాలి. పైకి తీయండి" అంటూ పురమాయించారు శోభనాద్రి గారు. ఎలా వచ్చిందో గానీ మా

ఆవిడకు కూడా ఎక్కడలేని తెంపు వచ్చేసింది. యాత్రలో దారి కావిలిగా ఉండడం కోసం తెచ్చుకున్న వేరుశనగ గింజలు, చక్కిలాలు, పప్పు బిళ్ళలు తాను పైకి తీయసాగింది.

"అరకిలో అనాబ్‌షాహీ అట్లాగే ఉండిపోయిందండీ. బస్సులో కూచుని తిందామనుకున్నాం. ఏం, అరుణా. కాసిన్ని ద్రాక్షపళ్ళయినా తినవూ?" బ్రతిమాలుకో సాగాడు సారథి.

"నాయిన్నాయనా, ఎవురి దగ్గరైనా బన్‌రొట్టుంటే ఇచ్చి పుణ్ణెం గట్టుకోరూ" అంటూ అంగలార్చడం మొదలెట్టింది అచ్చమ్మ.

"భలేదానవే. నీకు బన్‌రొట్టె దప్పితే మరొకటి పనికిరాదా అచ్చమ్మా?" అంటూ విస్తుపోయింది. వేదవల్లి.

"బిసకట్టయినా సరే. ఏదో ఒకటి ఈ తల్లీ. వరదయ్యకు నాలుక పిడచగట్టుకపోయినట్టుంది. ఎక్కడ శోష తగిలిపోతుందోనని భయంగా ఉంది...."

"మరైతే నువ్వేమైనా దేవతా మనిషివా అచ్చమ్మా. నీకు మాత్రం ఆకలి వెయ్యదా? వరదయ్యకు కూడా ఏదైనా ఇద్దాంలే. ముందు నీ సంగతి జూడు..." అంటూ మందలించింది మా ఆవిడ.

"అమ్మయ్యా, పది కాలాలపాటు బతకాల్సినోల్లు. పది మంచి పన్లు చేయాల్సినోల్లు మీరు. నాదేముంది? ముసిల్దాన్ని, నేం జస్తే ఎవరికే నష్టం?"

నిజానికప్పుడు సంభాషణ కొనసాగించడానికి కావలసిన త్రాణ గానీ, ఓపరికం గానీ మాలో ఎవ్వరికీ లేదు. మాదే కడుపుకు పరితర్పణగా ఏది దొరికితే ఆ ఖాద్య పదార్థాన్ని మెసవి, మింగేశాము. అంతటితో ఆత్మారాముడు శాంతించవలసిందే. ఊహూం, అతడు మరొక విచిత్రమైన కోరికను బయటపెట్టాడు – శోభనాద్రి ద్వారా.

"తిండి సంగతి సరే. కానీ దాహశాంతికి నీళ్ళు కావాలి కదా?" అన్నారాయన.

నేను ఫక్కున నవ్వేశాను. నాతోబాటుగా మాలో ఇద్దరు ముగ్గరు నవ్వినట్టు తోచింది. అప్పుడే కురిసిన వాననీళ్ళు, కొండలపైనుంచీ దొర్లుకొచ్చినవి – ఎక్కడబడితే అక్కడ నేలవాలును బట్టి జరజరా సాగిపోతున్నాయి. కానీ తాగాలంటే కుదురుతుందా? జబ్బు కొని తెచ్చుకున్నట్టే కదా!

కానీ ఈ ధర్మ సందేహం అట్టేసేపు నిలవలేదు. ఏర్పడిన అవసరం దాన్ని తోసి రాజనేసింది. వేదవల్లి ఇచ్చిన రైలు కూజా పట్టుకెళ్ళి బండపైన పళ్ళంలో నిలిచిన తేట నీటిని తీసుకొచ్చేసింది అచ్చమ్మ. బిడ్డల పట్ల తల్లితండ్రుల కుండే వాత్సల్యంలా ఆ నీళ్ల ఎంతో చల్లగా ఉన్నాయి. మధురంగా ఉన్నాయి. జబ్బు సంగతి దేముడెరుగు. అప్పటికా నీళ్లు మాకు అమృతతుల్యంగా ఉండిపోయాయి.

అప్పుడన్నాను –

"సరేగానీ అచ్చమ్మా, ఇందాకా నువ్వు నేను చస్తే ఎవరికేం నష్టం అన్నావు గదా. ఆ మాట మాత్రం నేను ఒప్పుకోను. నువ్వొక్కదానివి గనుక లేకపోతే మేమూ చెట్టు కిందనే అఘోరించి ఉందుము. జరిగిన జలప్రళయంలో నిలవరించుకోలేక చెట్టుకొకరంగా, పుట్టకొకరంగా కొట్టుకపోయి ఉందుము. ప్రాణాలతో మాత్రం మిగిలి ఉండము. పట్టుబట్టి మమ్మల్ని ఈ మండపంలోకి చేర్పించావు. ఆ తరువాత కూడా మాకెంతో ఆసరాగా నిలిచావు. మేమీమాత్రం నిబ్బరంగా ఉండగలిగామంటే అదంతా నీ చలవే".

ఏం నాయినా, నా దయిర్నం సంగతా నువ్వు సెప్పేది. దాండేముంది? ఎందుకు బయపడాల్నో తెలవాల గదా. ఏమహాన్నబావుడో కట్టించిపోయిన మండపం

ఒకటుండిపోయ. ఇంకింత గాలివాన పట్టుకున్నా, కొట్టుకోని పోమని తెలిసిపోయ. పోనీ, అడవి మెకాలొస్తేనో - అంటావేమో. అవీ జీవజంతువులే గదంటయ్యా. వెచ్చంగా గెవుల్లో ఎక్కడ్నో పందుకోక, అవిమాత్రం తల బయటికి సూపిస్తాయా? అంతగా వచ్చినాయే అనుకో. మన మందరం అరిస్తే ఉడాయించవూ. ఇంక దొంగల మాటంటావా? బస్సురాలేదనీ, మనమందరమూ ఈడ అడవిలో తగులుకోని పోయినామనీ వాళ్లకు తెలవొద్దా? తెల్సినా రొంపిలో, రొచ్చులో వాల్లు కొండల పక్కనుంచీ రావద్దా? అయినా యాతర్ల కొచ్చేవాళ్ళు పెద్ద నగలేమీ యేసుకరారని వాళ్ళకు తెలుసుండదా? వచ్చినారే అనుకో ముక్కుపుల్లలు, చెవికమ్మలు, ఇంకా అటువంటివేమైనా ఉంటే తీసి, వాల్ల ముకాన కొడితే, వాల్లే పోరా. అట్టా కాదు. నిజ్జెంగా ఆపదే వచ్చింది. పాణాలే పోయినాయి. ఏం చేయగలం? బయపడతా కూకుంటే పోయే పాణాలు నిలస్తాయా? బతికి ఉన్నోల్ల కంటే సచ్చినోల్లే గదంటయ్యా ఎక్కువ. ఎక్కువ మందితో కలిసుండడంలో బయమేముంది, జెప్పు. అదే నాయినా నా దయిర్నం. అంతకు మించి ఏం లేదు..."

బరువెక్కిన గుండెలు తేలిక పడిపోయినట్టు, ధైర్యాన్ని సూది మందుగా చేసి 'ఇంజక్టు' చేసినట్టు మా కందరికీ పెద్ద రిలీఫ్ ఏదో కలిగింది. అచ్చమ్మ చెప్పిన మాటలు ఒక్కొక్కటిగా జ్ఞప్తికి వస్తుంటే, అందును గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. సమస్థాయిలో వినవస్తున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను బట్టి తోడి యాత్రికుల్లో కొందరికి నిద్ర పట్టిందని గ్రహించాను. అచ్చమ్మ పద్మాసనం వేసుకుని కూర్చునే ఉంది. నాలుగు బిస్కట్లు, రెండు కమలా పళ్ళు తిని శోష తగిలే దుస్థితి నుంచీ తప్పించుకున్న వరదాచారి కూడా, ఆమె ఒడిలో తలపెట్టుకుని నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. మేలుకునేటప్పటికి ఓ అద్భుత ప్రపంచం నా ఎదుట ప్రత్యక్షం గావడానికి సిద్ధమై ఉంటుందని ఆ నిద్రలో నేనేమీ కలగనలేదు. ఒకానొక అతిలోక మనోహరమైన దృశ్యం కన్పించినప్పుడు పులకించి, పరవశించి పోగలమే గానీ, మాటలతో దాన్ని వర్ణించలేము. నీరెండలో రజతాద్రి శిఖరాల సోయగాలు నేను వీక్షించలేదు. సాయంకాలపు పసిమి వెలుగుల్లో మానస సరోవర దివ్య దృశ్యాన్ని తిలకించలేదు. మూడు సముద్రాల కూడలి కన్యాకుమారి వద్ద నిలబడి మున్నీటి నీటి తరగలతో కాంతి కిరణాలు సరాగాలాడే సూర్యోదయాలను దర్శించలేదు. సృష్టిలోని అపురూప సౌందర్య విలాసాల నెన్నింటినో చూడలేకపోయినందుకు ఆ తెల్లవారుజామున నాకు నష్టపరిహారం లభించింది. ఇంద్రజాలికుడెవరో మంత్ర దండం విసరినట్టు మబ్బులన్నీ మటుమాయమైపోయాయి. వినీల సరోవరం లాంటి నిర్మలాకాశంలో చందమామ రాజహంసలా తేలిపోతున్నాడు. ఆకులపైన మెరిసి, కొమ్మల పొడుగునా విరిసి, పొదలతో దోబూచులాడి, చెమ్మగిల్లిన బండలకు వెండిపూత పూసి, జల బిందువులపైన మిలమిలలాడి, జలధారల్ని సరిగ పోగులుగా మార్చి, జలప్రవాహాలకు వింత శోభలు రంగరించి వెన్నెల వెలుగులు ఆ లోయనంతా ఆప్యాయంగా పొదివి పట్టుకున్నాయి.

"ఏం నాయినా, అప్పుడే లేచేస్తివా? ఇంకా కాసేపు పడుకోరాదా?" అంది అచ్చమ్మ.

కానీ నాకు పడుకోవాలని లేదు. చిన్నప్పటి నుంచీ ఒక మధురోహ నన్ను వెంటాడుతూ వచ్చింది. సరిగ్గా ఇలాంటిదే ఒక ఆనందధామం. అచ్చంగా ఇలాగే ప్రశాంత వాతావరణం. అక్కడ ఏకాంతంగా నేను. ఎక్కడి నుంచీ వినవస్తుందో తెలియని మధురమైన, మార్దవమైన, మంజులమైన వేణుగానం పర్వత సానువులలోని గాలితో

కలిసిపోయి రవళిస్తూ ఉంటుంది. క్రమక్రమంగా నా అస్తిత్వం కరిగిపోతుంది. అప్పుడిక వేణుగానం మాత్రమే ఉంటుంది. నేను ఉండను.

నా కల... చిరకాలపు నా పగటి కల... నిజమైంది.

ఆ తన్మయావస్థలో నుంచీ బయటపడేసరికి వెన్నెల వెలుగులు బాగా పలచబడిపోయాయి. తూర్పు కొండ వెనుకవైపు నుంచీ తొలి సంజ కెంజాయలు తొంగిచూస్తున్నాయి.

✧ ✧ ✧

నిజమైన ఆ అనుభవం కూడా నాకిప్పుడు ఓ కలలాగే ఉంది. అపురూపమైన అనుభవం ఏదైనా ఎదురైనప్పుడు దాన్ని పదిమందికీ చెప్పుకోవాలని ఎవరికైనా ఉంటుంది. మరైతే నా అనుభవాన్ని నేనెందుకు కథగా రాయకూడదు? నిషేధమేమీ లేదు గానీ ఒక సందేహం. ఇలాంటివి, లేక కాస్తో కూస్తో దీనితో పోలికలున్నవీ, అయిన అనుభవాలు గతంలో కొందరికి కలిగి ఉండొచ్చు గదా, పోనీ, ప్రత్యక్షంగా గాకపోయినా పరోక్షంగా – అంటే ఇతరుల ద్వారా తమ ఎరుకలోకి వచ్చి ఉండొచ్చు గదా. వారిలో కొందరు ఆ అనుభవాలకు కథా రూపం ఇచ్చి ఉండొచ్చు గదా! అసంభవమేమీ కాదు. నేను రాయదలచుకుంటున్న ప్రస్తుత కథలో నా మట్టుకు నాకే కొన్ని పాత కథల జాడలు స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాయి. కొండ శిఖరంపైన నిలబడి కిందలి చెరువు నీటిలో తమ ప్రతిబింబం చూడదలచుకున్న కుర్రవాళ్ళు ముగ్గురు చీకటి పడిపోవడం వల్ల తిరుగుదారి ఏదో కనిపించక ఓ బండరాతిపైన ఒక రాత్రంతా వేవగించిన కథ 'మరపురాని ఆ ఊరు'. తుఫాను పట్టిన రాత్రివేళ రైల్వేస్టేషను వెయిటింగు రూములో ఒంటరిగా చిక్కుపడిపోయిన ఓ పెద్దమనిషి, ఒక భిక్షుకురాలి సాన్నిహిత్యంలో చిత్త స్థైర్యాన్ని పొందిన కథ 'గాలివాన', ఇంకా ఇలాంటివి మరికొన్ని ఉండొచ్చు. అయితే తమ తమ అనుభవాలను గురించి వాళ్ళు రాసేవారన్న కారణం వల్ల నా అనుభవం గురించి నేను మరచిపోవలసిందేనా? క్షమించాలి. ఎవరి అనుభవం వాళ్ళది. ఎవరి వ్యాసంగం వాళ్ళది. గులాబీలు పరిమళిస్తున్నాయి గదా అని గడ్డిపువ్వులు వికసించడం మానేస్తాయా? నక్షత్రాలు వెలుగుతున్నాయి గదా అని మిణుగురు పురుగులు సంచరించడం మానేస్తాయా? మహానదులు ప్రవహిస్తున్నాయి గదా అని, వాగులు వంకలు ప్రవహించడం మానేస్తాయా? నేను గడ్డిపువ్వుగానైనా వికసిస్తాను. మిణుగురు పువ్వుగానైనా సంచరిస్తాను. నా పాటుకు నేను సెలయేరుగానైనా ప్రవహిస్తూనే ఉంటాను.

"ఏమండీ, మీ ఆలోచన లింకా ఒక కొలిక్కి రాలేదా?"

మా ఆవిడ పిలుపు వినిపించడంతో ఉలికిపడి లేచి నిల్చున్నాను.

ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. గంట ఎనిమిదైనట్టుంది. ఆంగ్లంలో వార్తలొస్తున్నాయి.

పర్మిషన్ ఇస్తున్నట్టుగా అంది నాగమణి –

"రాసుకుందురుగానీ, ముందు భోజనానికి రండి".

● *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక –1987* ●